ఉర్దూ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కర్నూలు నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.లోకనాథ్ శుక్రవారం పేర్కొన్నారు. ఎం.ఎ. ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్, ఎమ్మెస్సీ ఎండస్ట్రియల్ కెమిస్ట్రీ కోర్సులో విద్యార్థులు తక్షణ ప్రవేశాలు పొందవచ్చునన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 8341511632 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండ: ఎస్పీ


పోలీసు అమరవీరుల కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల కుటుంబాలకు జిల్లా పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రావాల్సిన రాయితీలు, కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులు, వారి బాగోగులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గార్డు విధుల్లో పనిచేస్తున్న ఏఆర్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా శుక్రవారం పంకాలు, పరుపులు తదితర వాటిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రాణాల్లో పని చేస్తున్న సిబ్బంది వారి సమస్యలను రాతపూర్వకంగా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, డీపీవో ఏవో జ్యోతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక విధానంపై సర్వత్రా హర్షం

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై విస్తృత చర్చ

ఈనాడు, కడప : ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇది వరకే ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ఎదురయ్యాయి. ఇసుక రేవులు, నిల్వ కేంద్రాల్లో రాజకీయ పెత్తనం అధికమైంది. ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి, రైల్వేకోడూరులో ఇసుక దందాకు తెరలేపారు. ఇటీవల టెండర్లు ఆహ్వానించినప్పటికీ వాటిలో జోక్యం చేసుకుని తమకు అనుకూలమైన వ్యక్తులకు ఇప్పించే ప్రయత్నాలు జరిగాయి. రైల్వేకోడూరులో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజంపేటలో ఓ వైకాపా ప్రజాప్రతినిధి పెద్ద ఎత్తున దందా సాగిస్తున్నారు. జమ్మలమడుగులోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం వినియోగదారులు రేవుల్లోకి ఎండ్లబండ్ల తరహాలోనే ట్రాక్టర్లను తీసుకెళ్లి ఉచితంగా తీసుకెళ్లడానికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇసుక రవాణాలో అక్కడక్కడ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శించారు. తాజా నిర్ణయంతో వినియోగదారులు తమ అవసరాలకు ఇసుక సొంతంగా తీసుకెళ్లడానికి ఆస్కారం ఏర్పడింది. ఎలాంటి సీనరేజ్ చెల్లించే అవసరం లేకుండా ఇసుక, రవాణా ఖర్చులు సొంతంగా భరించుకుని సరఫరా చేసుకునే సౌలభ్యం ఏర్పడింది. దీంతో అక్కడక్కడ తలెత్తిన అక్రమాలకు ఆస్కారం లేకుండాపోయింది. పలువురు రాజకీయ నేతల ఇసుక దందాకు చాలావరకు అడ్డుకట్ట పడినట్లయింది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఇసుక సరిహద్దులు దాటకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అటు బెంగళూరు ఇటు హైదరాబాద్‌కు తరలిపోకుండా తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

పెరిగిన పంట నష్టం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురిసిన భారీ వర్షాలతో పంట నష్టం మరింత పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల పరిధిలోని 55 గ్రామాల్లో 1,909 మందికి చెందిన 1,433.01 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. కంది 0.40 హెక్టార్లు, మొక్కజొన్న 16.19, వేరుసెనగ 21.04, శనగ 122.83, వరి అత్యధికంగా 1,272.54 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు రైతు సేవా కేంద్రాల బాధ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా అధికారులకు సమాచారమిచ్చారు. ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు అందగానే సర్వే చేపడతామని డీఏవో నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని వివరించారు.

టెట్‌కు 1,367 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,589 మందికి 1,367 మంది హాజరయ్యారని డీఈవో అనూరాధ తెలిపారు.

ఎంతో అన్నారు... కొంతే చేశారు!

- వైకాపా ప్రభుత్వ హయాంలో నిలిచిన బుగ్గవంక రహదారుల నిర్మాణం
- పత్తాలేని గుత్తేదారులు... నిరుపయోగంగా మారిన రూ.4.5 కోట్ల పనులు


పాతబస్టాండు వద్ద నిరుపయోగంగా మారిన రహదారి

–న్యూస్‌టుడే, కడప నగరపాలక సంస్థ

కడప నగరంలోని ఎర్రముక్కపల్లి నుంచి ద్వారకానగర్ వరకు ముళ్లచెట్లు .. అక్కడ నుంచి నాగరాజుపేట వరకు మట్టికుప్పలు.. ఆ తర్వాత పాతబస్టాండు వరకు కచ్చా రోడ్డు... అక్కడి నుంచి అల్మాస్‌పేట వరకు తారు రోడ్డు (కొంత భాగం వరకు మాత్రమే)... ఇవీ గత అయిదేళ్లుగా చేపట్టిన బుగ్గవంక సుందరీకరణ పేరిట చేపట్టిన పనులు. 2020, సెప్టెంబరు 20న అప్పటి ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.14.25 కోట్ల స్టేట్ డెవలప్‌మెంటు నిధులు మంజూరు చేశారు. ఇప్పటివరకు రూ.4.5 కోట్ల విలువైన పనులు జరిగాయి. వీటిని చేపట్టిన ప్రధాన గుత్తేదారుకు ఇప్పటి వరకు రూ.20 లక్షల బిల్లులు చెల్లించినట్లు సమాచారం. బుగ్గవంకకిరువైపులా రహదారుల నిర్మాణం చేపట్టిన ఓ గుత్తేదారుకు మాత్రం నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.2 కోట్ల మేర బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. మొత్తానికి గుత్తేదారులు పత్తాలేకుండాపోయారు. వారు ఇప్పటివరకు చేపట్టిన మట్టి పనులు, అరకొర తారు రహదారులు మాత్రమే మిగిలాయి.

ప్రయోజనం శూన్యం...

రైల్వే వంతెన నుంచి అల్మాస్‌పేట వరకు బుగ్గవంకకు ఇరువైపులా 40 అడుగుల రహదారి నిర్మించాలి. దీంతోపాటు వీధి దీపాల ఏర్పాటు, మురుగు నీటిపారుదల వ్యవస్థలను నెలకొల్పాలి. అల్మాస్‌పేట నుంచి పాతబస్టాండు వైపు రహదారి నిర్మాణానికి కంకర పరిచారు. కొంత వరకు తారు రోడ్డు వేశారు. పాతబస్టాండు నుంచి నాగరాజుపేట వరకు, అక్కడ నుంచి ద్వారకానగర్, ఎర్రముక్కపల్లి, రైల్వే వంతెన వరకు రహదారి నిర్మాణానికి తగినట్లు చదును పనులు చేపట్టారు. ఇంతటితో పనులకు స్వస్తి పలికారు. ఎక్కడి పనులు అక్కడ నిలిపేయడంతో మట్టిదారులపై పిచ్చి మొక్కలు మొలిచాయి. భవానీనగర్, పాత బస్టాండు, నాగరాజుపేట, జిల్లాపరిషత్తు కార్యాలయం, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో బుగ్గవంక వంతెనల కింద రహదారి నిర్మించాల్సిన ప్రాంతం మురుగుకూపంలా మారింది. బుగ్గవంక రక్షణ గోడ వెంట రహదారి నిర్మించాల్సిన ప్రాంతం తిరిగి పూర్వస్థితికి చేరుకుంది.


ఎర్రముక్కపల్లి వద్ద రహదారి నిర్మాణానికి తొలగించిన ఆక్రమణలు


బుగ్గవంక రహదారులపై ఏపుగా పెరిగిన కంప చెట్లు

రాకపోకలకు వీలు కల్పించలేరా?...

గుత్తేదారులు పనులు నిలిపేసిన అనంతరం నీటిపారుదల, నగరపాలక సంస్థలకు చెందిన అధికారులు బుగ్గవంక రహదారుల అభివృద్ధి పూర్తిగా గాలికొదిలేశారు. అల్మాస్‌పేట నుంచి భవానీనగర్ మీదుగా పాతబస్టాండు వరకు అక్కడక్కడ గుంతలు, కంప చెట్లు ఉన్నాయి. ద్వారకానగర్ - ఎర్రముక్కపల్లి మధ్య మెటల్ రోడ్డుపై ఇదే తరహాలో ఆటంకాలున్నాయి. నీటిపారుదల, నగరపాలక సంస్థల అధికారులు వాటిని తొలగిస్తే రోడ్ల వెంట తాత్కాలికంగా రాకపోకలు మొదలవుతాయి.

నెలరోజుల్లో మార్పు చూపుతాం - వెంకట్రామయ్య, ఈఈ, నీటిపారుదలశాఖ

బుగ్గవంక రహదారుల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేశాం. వారం రోజుల్లో అమల్లోకి వస్తుంది. నెల రోజుల్లో బుగ్గవంక రహదారులపై రాకపోకలు మొదలయ్యేవిధంగా చర్యలు తీసుకుంటాం.

బుగ్గవంక సుందరీకరణకు ప్రాధాన్యం - మాధవిరెడ్డి, ఎమ్మెల్యే, కడప



బుగ్గవంక రోడ్ల నిర్మాణంతో పాటు సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. రోడ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. రోడ్ల వెంట భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. పాలెంపల్లి వద్ద ఎస్టీపీ నిర్మించి మురుగునీటిని శుద్ధి చేస్తాం.


ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కలెక్టరుగా శివశంకరే కావాలి

సీఎం చంద్రబాబునాయుడిని కోరిన జిల్లా నేతలు

ఈనాడు, కడప: జిల్లా కలెక్టరుగా శివశంకర్‌ను కొనసాగించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెదేపా జిల్లా నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి వినతిపత్రం అందజేశారు. డీవోపీటీ ఆదేశాల మేరకు తెలంగాణ కేడర్‌కు బదిలీ అయిన కలెక్టర్‌ను వెనక్కి తీసుకు రావడానికి ప్రయత్నం చేయాలని వారు కోరారు. అనతి కాలంలోనే జిల్లాలో మంచి పేరు తెచ్చుకున్నారని, జిల్లా అభివృద్ధి పరుగులు పెట్టడానికి, సంక్షేమ కార్యక్రమాలు పారదర్శకంగా అమలుకు శివశంకర్ దోహదపడతారని వివరించే ప్రయత్నం చేశారు.

కమలాపురంలో అత్యధిక వర్షపాతం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి కమలాపురంలో అత్యధికంగా 67.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెండ్లిమర్రిలో 55.4, చింతకొమ్మదిన్నెలో 40.4, వల్లూరు, సింహాద్రిపురంలలో 22.4, ఎర్రగుంట్లలో 20.0, వీరపునాయునిపల్లెలో 16.4, కడపలో 13.8, ముద్దనూరులో 12.4, అట్లూరులో 12.0, వేంపల్లెలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నాబార్డు పనులు వేగవంతం చేయండి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: మంజూరైన పనుల్లో ఆలస్యం లేకుండా, వేగవంతంగా పూర్తి చేయాలని నాబార్డు డీజీఎం దినిపనీకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చిన ఆమె శుక్రవారం కడపలో రాయలసీమ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన పలు శాఖల అధికారులు, ఇంజినీర్లతో వర్క్‌షాపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాబార్డు నుంచి అనేక ప్రభుత్వ శాఖలకు మంజూరైన పనులను ఆయా అధికారులు నిబంధనల ప్రకారం చేయించాలన్నారు. ఏ చిన్న తేడా వచ్చినా పలు సమస్యలు వస్తాయని హెచ్చరించారు. నాణ్యతలో రాజీపడొద్దని హెచ్చరించారు. నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద ఇచ్చిన నిధులు, వాటికి సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయి, ఎన్ని పూర్తయ్యాయి, వాటికి బిల్లులు ఎందరు పంపారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాబార్డు ఏజీఎంలు అరుణ్, విజయవిహారి, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం దినిపనికర్

ప్రమాదంలో కడప అగ్నిమాపక కేంద్రం!


కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పునకు దన్నుగా పెట్టిన ఇనుప స్తంభం

కడప నగర నడిబొడ్డున ఉన్న అగ్నిమాపక కేంద్రం. భవనం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడిపడుతోంది. ఏడాది కిందట గోడ కూలిపోయింది. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భవనంలోని స్టోర్ గది పైకప్పు ఒరిగిపోవడంతో సిబ్బంది దన్నుగా ఇనుప స్తంభం ఏర్పాటు చేసుకున్నారు. అగ్నిమాపక వాహనాలు నిలిపేచోట పైకప్పు పెచ్చులూడుతుండడంతో రక్షణ చర్యలు చేపట్టారు. అగ్నిమాపక అధికారి ఉండే గది వర్షానికి కారుతుండగా, సిబ్బంది విశ్రాంతి గది దెబ్బతింది. ఈ విషయమై జిల్లా అగ్నిమాపకశాఖాధికారి ధర్మారావు మాట్లాడుతూ కొత్త భవనం నిర్మాణానికి పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. -న్యూస్‌టుడే, కడప నేరవార్తలు


కడప అగ్నిమాపక కేంద్రం


వాహనాలు నిలిపే చోట పెచ్చులూడిన పైకప్పు

నేతన్నలకు భరోసా!

15 శాతం రాయితీపై నూలు పంపిణీ

–న్యూస్‌టుడే, కడప గ్రామీణ


పడుగు తయారు చేసుకుంటున్న కార్మికులు(పాత చిత్రం)

చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. నూలుపై రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. గతంలో మాదిరి కాకుండా నిబంధనల్లో మార్పులు చేస్తూ జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయానికి ఉత్తర్వులు పంపింది. దీంతో జిల్లాలో వేలాదిమంది నేత కార్మికులు లబ్ధి పొందనున్నారు. జిల్లాలో వ్యవసాయం, పాడి రంగం అనంతరం చేనేత రంగమే ప్రధానం. జమ్మలమడుగు, మైలవరం, ప్రొద్దుటూరు, ఖాజీపేట, మైదుకూరు, మాధవరం, బద్వేలు, వల్లూరు, సింహాద్రిపురం, చింతకొమ్మదిన్నె, తదితర ప్రాంతాల్లో చేనేత వృత్తినే ప్రధానంగా చేసుకున్న కార్మికులు పదివేల మందికిపైగా ఉన్నారు. ప్రస్తుతం వారం రోజుల పాటు మగ్గంపై కూర్చుని నేసినా సరిపడా కూలి అందక ఇబ్బందులు పడుతున్నారు. వీరిని ఆదుకునేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ముడిపదార్థాల సరఫరా పథకం (రా మెటీరియల్ సప్లై స్కీం- ఆర్ఎంఎస్ఎస్) కింద 15 శాతం రాయితీపై నూలు ఇవ్వాలని సంకల్పించారు.

మారిన నిబంధనలు...

గతంలో నేరుగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌హెచ్‌డీసీకి నూలు కోసం దరఖాస్తు చేసుకుంటే వారు డిపోల ద్వారా, సంఘాలు, ఇతర వ్యవస్థల ద్వారా కార్మికులకు అందించేవారు. ఇప్పుడు అలా కాకుండా కావాల్సిన వారు జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయానికి ఇండెంట్ పెట్టాలి. దానికయ్యే విలువ మొత్తం ముందస్తుగా చెల్లించాలి. యార్న్ కార్మికునికి అందిన అనంతరం రెండు నెలల కాల వ్యవధిలో నేరుగా వారి ఖాతాలో 15 శాతం రాయితీ నిధులు జమవుతాయి.

వీరు అర్హులు...

తమకు వచ్చిన ఇండెంట్‌ను చేనేత, జౌళిశాఖ అధికారులు రాష్ట్ర కార్యాలయానికి పంపి, అక్కడ నుంచి కేంద్రం పరిధిలోని ఎన్‌హెచ్‌డీసీకి నివేదిస్తారు. ఏ సంఘంలోనూ లేకుండా సొంతంగా (వ్యక్తిగతంగా) నేసే కార్మికులు, వారు సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సమూహాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, చేనేత సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారు, హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీలు, మాస్టర్ వీవర్లు పంపిన చిరునామాలకే నూలు వస్తుంది. వ్యక్తిగతంగా నేసే కార్మికులు తమ సొంత చిరునామాకు లేదా సమీపంలోని నూలు డిపోల్లోనూ పొందే అవకాశం కల్పించారు.

కావాల్సిన వారు వివరాలు అందజేయాలి

నూలు కావాల్సిన కార్మికులు తమ శాఖలో వివరాలివ్వాలి. వ్యక్తిగతంగా, సంఘం ద్వారా రాయితీపై పొందొచ్చు. పరిమితి ప్రకారం నూలు ఇస్తాం. అది అయిపోగానే మళ్లీ అందజేస్తాం.

- పిచ్చేశ్వరరావు, చేనేత, జౌళిశాఖ అధికారి

10 నుంచి అగ్నివీర్ ఆర్మీ ర్యాలీ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కడప నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/ స్టోర్ కీపర్ టెక్నికల్ ట్రేడ్‌మెన్ (పది ఉత్తీర్ణత), ట్రేడ్‌మెన్ (ఎనిమిది ఉత్తీర్ణత) విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులు, ఇతర వివరాలకు www.joinindianarmy.nic.inవెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మెరిట్ ప్రకారం ఎంపికలుంటాయని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

హార్సిలీహిల్స్ టోల్‌గేటు ధరల పెంపు అమల్లోకి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ టోల్‌గేటు నిర్వహణ బాధ్యతలు రెవెన్యూశాఖ నుంచి ప్రైవేటు గుత్తేదారుని చేతుల్లోకి వెళ్లాయి. కొత్తగా పెంచిన వాహనాల ప్రవేశ రుసుం ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు ప్రారంభమయ్యే కాండ్లమడుగు క్రాస్ వద్ద తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లే వాహనాల నుంచి ప్రవేశ రుసుం కొన్నేళ్లుగా వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు ద్విచక్ర వాహనానికి రూ.30 తీసుకుంటుండగా, దీన్ని రూ.50కి పెంచారు. బస్సుకు రూ.170 నుంచి రూ.200 వసూలు చేయాలని నిర్ణయించారు. గతంలో మాదిరిగానే ఆటోలకు రూ.70, కార్లకు రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. వసూళ్ల బాధ్యతను గుత్తేదారునికి అప్పగించడానికి గత నెల 30న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. పెంచిన ధరలతో వసూళ్లకు అనుమతి రావడంతో టోల్‌గేటు రూ.45.20 లక్షలకు ఓ గుత్తేదారు అత్యధికంగా ధర పాడుకున్నారు. టౌన్‌షిప్ కమిటీ ఖరారు చేసిన ధరల ప్రకారమే వాహనచోదకుల నుంచి ప్రవేశ రుసుం వసూలు చేయాలని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

సూక్ష్మ సేద్యానికి ఊపిరి!

- రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు
- రైతుల ప్రగతే లక్ష్యంగా ఎన్డీయే సర్కారు దృష్టి

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు, మైదుకూరు


బిందు సేద్యం పద్ధతిని వివరిస్తున్న ఎంఐఏవో

సూక్ష్మ సేద్యం పథకానికి ఎన్డీయే సర్కారు ఊపిరి పోస్తోంది. బిందు, తుంపర సాగుకు అవసరమైన పరికరాలను 45, 55, 70, 90 శాతం రాయితీపై అందించేందుకు చర్యలు చేపట్టింది. రైతుల నుంచి వివరాల నమోదుకు శ్రీకారం చుట్టింది. పథకానికి 2014-19లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పెద్దపీట వేశారు. ఇదే స్థాయిలో అన్నదాతలను కూడా ప్రోత్సహించారు. దాంతో అప్పట్లో చాలామంది భూమిపుత్రులు సూక్ష్మ సేద్యంపై మొగ్గు చూపారు. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం పథకాన్ని గాలికొదిలేసింది. బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత కంపెనీలు ఆసక్తి కనబరచలేదు.

31 కంపెనీల ఎంపిక: జిల్లాలో పథకం అమలుకు 31,500 హెక్టార్లు లక్ష్యం కాగా, ఇందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే మూడు రెట్లు పెరిగింది. రైతులు ఆన్‌లైన్ కలిగిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో రైతు సేవా కేంద్రాలకెళ్లి వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏను సంప్రదించాలి. బయోమెట్రిక్ ద్వారా తమ పేర్లు నమోదుకు వీలు కల్పించారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు సచివాలయాల ద్వారా వివరాల నమోదు చేస్తున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వ్యవసాయశాఖకు నిధులు కేటాయించడంతో రైతులకు రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టాలని ఆదేశాలు రావడంతో పథకానికి ఆయువు పోసినట్లయింది. పరికరాల సరఫరాకు సుమారు 31 కంపెనీలను సర్కారు ఎంపిక చేసింది.

రాయితీలు ఇలా...: సూక్ష్మ సేద్యంలో రెండు హెక్టార్లలోపున్న రైతులకు 90 శాతం రాయితీ రూ.2.18 లక్షల వరకు లభిస్తోంది. 2.5 హెక్టార్లకు ఉన్న వారికి 70 శాతం రాయితీతో సేద్య పరికరాలు పంపిణీ చేయనున్నారు. తుంపర సేద్యంలో అయితే 2 హెక్టార్లకు 55 శాతం, రెండు హెక్టార్ల కంటే ఎక్కువ ఉన్న కర్షకులకు 45 శాతం రాయితీపై పరికరాలు మంజూరు చేస్తారు. జిల్లాలో 2024-25గాను ఇప్పటి వరకు 19,132 మంది రైతులు 24,750 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అధికార గణాంకాలు చూపుతున్నాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి...

సూక్ష్మ సేద్యం పథకం ద్వారా సాగు జలాలు సంరక్షణతో పాటు ఖర్చులు తగ్గించుకోవచ్చు. రాయితీపై పరికరాల సరఫరాకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలోను, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారులను సంప్రదించాలి.

- మురళీమోహన్‌రెడ్డి, పీడీ, ఏపీఎంఐపీ

రైలు కింద పడి వివాహిత మృతి


సుజాత (పాత చిత్రం)

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం రైల్వే నిలయంలో తిరుపతి-హుబ్లీ ప్యాసింజర్ రైలు ఎక్కుతూ జారి పడి ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు చెందిన పులివెందుల సుజాత (35) మృతి చెందారని హెడ్‌కానిస్టేబుల్ రాజారెడ్డి తెలిపారు. వివాహిత రాలైన ఈమె కొంత కాలంగా భర్తకు దూరంగా ఉన్నారన్నారు. ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు.

అప్పుల బాధతో బలవన్మరణం

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని దిగువతంబళ్లపల్లెకు చెందిన భూమా వెంకటరెడ్డి (66) అనే వ్యక్తి ఉరేసుకొని మృతి చెందాడని ఎస్సై చిరంజీవి తెలిపారు. వెంకటరెడ్డి పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి దగ్గరలోని కనుమల సమీపంలో శవమై కనిపించడంతో స్థానికులు గుర్తించారన్నారు. తన భర్త అప్పుల బాధతో ఉరేసుకుని మృతి చెంది ఉండవచ్చని వెంకటలక్షుమ్మ ఫిర్యాదు చేశారన్నారు.

కుమారుడి దాడిలో తండ్రికి తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధి తుమ్మలూరులో తండ్రిపై కుమారుడు గొడ్డలితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... తుమ్మలూరు గ్రామానికి చెందిన బాలిరెడ్డి, అతని కుమారుడు ప్రసాద్‌రెడ్డి ఇద్దరూ గురువారం రాత్రి ఇంట్లో పడుకున్నారు. ప్రసాద్‌రెడ్డికి మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో నిద్రలో ఉన్న తండ్రిపై అతను గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాలిరెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయాన్నే స్థానికులు చూసి, బంధువులకు సమాచారమివ్వడంతో వారు కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని గ్రామీణ సీఐ చల్లని దొర పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఆర్ అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా బి.రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి నుంచి కడపకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న కృష్ణారావు ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని రమణయ్య పేర్కొన్నారు.


రమణయ్య

నగర నాయకత్వం మాకెందుకివ్వరు?

వైకాపాలో పదవీ చిచ్చు

కడప నగరపాలక న్యూస్‌టుడే: వైకాపా కడప నగర అధ్యక్ష పదవి ఆ పార్టీలో చిచ్చు పెట్టింది. దానిని తమకెందుకివ్వరని బీసీ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంజాద్‌బాషా, నగరమేయర్ సురేష్‌బాబులను నిలదీసినట్లు తెలిసింది. వైకాపా నగర అధ్యక్షుడిగా ... చెందిన ఓ కీలక సామాజికవర్గానికి చెందిన నాయకుడి ఎంపిక ఖరారైందని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు అగ్రనాయకుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప నియోజకవర్గంలో బీసీలు అధిక సంఖ్యలో ఉండడం, జిల్లా అధ్యక్ష స్థానాన్ని వారి నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ పదవిని తమకే ఇవ్వాలని రాజారెడ్డి వీధికి చెందిన ఒక యువనాయకుడు పట్టు బట్టినట్లు తెలిసింది. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న బలిజ సామాజిక వర్గానికి పార్టీ పదవుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆ వర్గానికి చెందిన ముఖ్య నాయకులు నిలదీశారు. కడప నగరంలో మైనార్టీలు అధికంగా ఉన్నందున ప్రాధాన్యం ఇవ్వాలని నాగరాజుపేట ప్రాంతానికి చెందిన మైనార్టీ నాయకుడు పంచాయితీ పెట్టారు. మరో వైపు నగరపాలకసంస్థలో కీలక కార్పొరేటర్‌గా ఎదిగిన బీసీ నాయకుడు ఈ పదవిని దక్కించుకోవడానికి తెరవెనుక ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కార్పొరేషన్ రాజకీయాల్లో ద్వితీయస్థానంలో ఉన్న నాయకుడు, రాజారెడ్డి వీధికి చెందిన కీలక ఎస్సీ నాయకుడు కూడా రంగంలో ఉన్నారు. చివరకు ఎవరికి కట్టబెడతారో వేచిచూడాలి.

భూసంరక్షణ... నిధుల్లేక నిస్సారం

ఉమ్మడి కడప జిల్లాలో దయనీయ పరిస్థితి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం, కలసపాడు, ఎర్రగుంట్ల


కలసపాడు మండలం పాతరామాపురంలో నిర్మించిన నీటికుంట

సాగుకు ప్రధానమైనవి మట్టి, నీరు. సారవంతమైన, పోషకాలతో కూడిన భూములను సంరక్షించుకోవడంతో పాటు నీటి పారుదలతోనే పంటల దిగుబడిని పెంపొందించుకునేందుకు వీలుగా ఏర్పాటైన భూసంరక్షణ విభాగం ఉమ్మడి కడప జిల్లాలో నిర్వీర్యమైంది. సాగుకు అనుబంధంగా ఉన్న పశుపోషణ, కోళ్ల పెంపకాలతోనే రైతుల ఆదాయాలను మరింత రెట్టింపు చేసేందుకు అనువుగా ఉన్న ఈ విభాగం కరవు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా మారింది. వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న ఈ విభాగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాల్సిన నిధులు ఐదేళ్ల నుంచి ఒక్కపైసా కూడా మంజూరు కాలేదు.

రైతులకు ప్రయోజనం

రైతుల అభివృద్ధికి దోహదపడే ఈ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కేటాయిస్తోంది. ఈ నిధులతో దుర్భిక్ష ప్రాంతాభివృద్ధి పథకం (ఆర్‌డీపీ) 50 శాతం రాయితీతో ఎంపిక చేసిన క్లస్టర్ గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు, నీటి సరఫరా గొట్టాల ఏర్పాటు, వాటర్‌షెడ్‌ల సంరక్షణ ఆయిల్ ఇంజిన్లు, గొర్రె పిల్లల పెంపకం, పంటకోత అనంతర నిల్వ కేంద్రాల నిర్మాణానికి వ్యయం చేస్తారు. ప్రధాన మంత్రి కృషి సించయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద రైతుల పంట పొలాల్లో 50 శాతం రాయితీతో వ్యక్తిగత ఫారమ్ పాండ్ నిర్మాణాలు వంద శాతం రాయితీతో సామూహిక నీటికుంటలు నిర్మించవచ్చు. ఉమ్మడి కడప జిల్లాలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో రైతులకు 50 శాతం రాయితీతో నీటి సరఫరా గొట్టాలను, ఆయిల్ ఇంజిన్లను అందజేశారు. చిన్న కమతాల రైతులకు నీటిసంరక్షణ నిమిత్తం ఎండిపోయిన బోర్ల పునరుద్ధరణ, భూగర్భ జల మట్టాల పెంపునకు నీటి కుంటల నిర్మాణార్థం నిధులు కేటాయించారు. వాగులకు గట్లువేయడం, చెరువుల్లో పూడిక తొలగించి వాటిని పొలాలకు మళ్లించడం, పంటలకు అనుబంధంగా పశుపోషణను పెంపొందించడంపై రైతులకు రాయితీతో నిధులను కేటాయిస్తోంది.

సిబ్బంది ఇతర విభాగాలకు బదిలీ

ఉమ్మడి కడప జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, కడప, బద్వేలు సబ్ డివిజన్‌ల పరిధిలో భూ సంరక్షణ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు 12 మండలాల దాకా ఉన్నాయి. సబ్ డివిజన్‌కు ఒక ఏడీఏ, ఇద్దరు ఏవోలను కేటాయించారు. ఈ విభాగానికి నిధులు రాకపోవడంతో చాలా సబ్ డివిజన్లలో సిబ్బంది వ్యవసాయ శాఖలో ఇతర విభాగాలకు డిప్యుటేషన్‌తో పాటు బదిలీపై వెళ్లారు. జిల్లా స్థాయి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) అధికారి లేరు. 2019 నుంచి ఉమ్మడి జిల్లాకు నిధులు ఒక్క పైసా రాలేదు. దీంతో నిధులు లేకపోవడంతో తీవ్ర కరవు ప్రాంతాల్లో భూ, నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేక మిన్నకుండిపోయారు.

సేవల మెరుగుకు చర్యలు

భూసార సంరక్షణ విభాగానికి ఐదేళ్ల నుంచి ఒక్క పైసా నిధులు కూడా రాలేదనడం వాస్తవమే. వ్యవసాయ అనుబంధ పనులు మెరుగుపరచుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇక్కడి ఇబ్బందులను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-నాగేశ్వరరావు, వైఎస్సార్ జిల్లా వ్యవసాయాధికారి

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు నూతన పాలసీలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం కడపలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ మాట్లాడుతూ కొత్తపాలసీలు రాష్ట్రాభివృద్ధి ముఖచిత్రాన్నే మారుస్తాయని చెప్పారు. అక్షయ్‌కుమార్ రెడ్డి, నవీన్, ఫరీద్, హర్ష, శివానంద రెడ్డి, వర్ధన్, వెంకటేశ్, శ్రీను, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

గ్రామ సచివాలయాల సేవలు బలోపేతం చేయాలి


వైద్య సేవలను విచారిస్తున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషనర్ కార్యదర్శి కరుణాకర్

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల వ్యవస్థకు సంబంధించి మెరుగైన సేవలను బలోపేతం చేయాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషనర్ కార్యదర్శి కరుణాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక గోపవరం, కొత్తపల్లె పంచాయతీ కార్యాలయాల కార్యదర్శులు రామకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి సిబ్బంది పనితీరు, నిర్వహణ, అందజేస్తున్న పౌర సేవల వివరాలపై ఆరాతీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సామాజిక న్యాయం చేయాలన్నారు. సమయపాలనతో ప్రజల దరఖాస్తులు, అర్జీలను సత్వరంగా పరిష్కరించాలని నిర్దేశించారు. కొత్తపల్లె-1 విలేజ్ హెల్త్ క్లీనిక్ కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల లభ్యత, పట్టికలను పరిశీలించారు.

ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను నియమించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటి ఏపీపీఎస్సీకి ఛైర్మన్ నియామకం లేకపోవడంతో ఉద్యోగాల నోటిఫికేషన్లు, రాత పరీక్షలు నిలిచిపోయాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్-2 మెయిన్ పరీక్షల కోసం లక్షలాది మంది వేచి చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి తులసీశ్వర్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జిల్లాలో ఎవరైనా లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బాలబాలికల మధ్య అసమానతలను తొలగించి ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. స్కానింగ్‌సెంటర్లు, వైద్యులు నిబంధనలమేరకు నడుచుకోవాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, వైద్య, పోలీసు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, పక్కన ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్

ప్రజలపై భారం తగ్గించండి: సీపీఐ

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఇసుక పాలసీ ప్రజలపై భారాన్ని, మద్యం పాలసీ ప్రజల మాన ప్రాణాలపై ప్రభావం చూపుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆరోపించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ గత అయిదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇసుక, మద్యం, భూమి, గనులు కేంద్రీకృతం చేసి దోపిడీ చేశారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, ఎదురించిన వారిపై దాడులు, అడ్డుకున్న వారిని చంపడానికి కూడా వెనకాడలేదని విమర్శించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనలో తీసుకొచ్చిన ఇసుక పాలసీ ప్రజల పాలిట శాపంగా, ఇంటి నిర్మాణాలు చేపట్టే వారికి పెనుభారంగా మారిందన్నారు. నాణ్యమైన మద్యాన్ని కారు చౌకగా అందుబాటులోకి తెస్తున్నామంటూ ప్రజల మాన ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా ఉందన్నారు. వాటిని మార్చకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గసభ్యుడు కేసీ బాదుల్లా, గంగాసురేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

డబ్బులిస్తేనే దివ్యాంగులకు అర్హతపత్రం

మారుతీనగర్, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పింఛన్ పొందేందుకు అర్హత పత్రం కోసం రిమ్స్‌కు వెళితే సిబ్బంది రూ.30 వేలు వసూలు చేస్తున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు మడగలం ప్రసాద్ ఆరోపించారు. దీనిపై ఆధారాలతో స్థానిక రిమ్స్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అర్హులైన వారికి కాకుండా డబ్బులు ఇచ్చిన వారికే అర్హత పత్రాలు ఇస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాకపా నాయకులు విజయ్‌కుమార్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

వినియోగదారులపై ట్రూఅప్ ఛార్జీలు మోపొద్దు

వేంపల్లె , న్యూస్‌టుడే: వినియోగదారులపై కూటమి ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు మోపొద్దని కాంగ్రెసు రాష్ట్ర ముఖ్య అధికారి ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటలో కోరారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీవోనంబరు 22ను రద్దుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, నాలుగు నెలలవుతున్నా అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై ప్రభుత్వం అదనపు భారం మోపేందుకు సిద్ధమైందని, ఇది చాలా అన్యాయమన్నారు. 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ హామీపై కూడా అడుగు ముందుకు పడలేదని చెప్పారు.

మద్యం దుకాణాల ఏర్పాటులో గొడవ

తెదేపా, భాజపా మధ్య చిచ్చుపెట్టిన ప్రభుత్వాధికారి

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- జమ్మలమడుగు, ముద్దనూరు: మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో వైఎస్ఆర్ జిల్లా ముద్దనూరులో శుక్రవారం రాత్రి వివాదం తలెత్తింది. రెండు వర్గాల మధ్య వివాదం ముదిరి యుద్ధ వాతావరణాన్ని తలపించింది. మిత్రపక్షాలైన తెదేపా, భాజపా మధ్య జలవనరులశాఖ ఇంజినీరు మధుసూదన్‌రెడ్డి చిచ్చుపెట్టారు. వైకాపా హయాం నుంచి విధులకు హాజరుకాకుండా డుమ్మాకొడుతూ జీతం మాత్రం తీసుకుంటున్నారు. మండలంలో దందాలు సాగిస్తున్నారు. ఇదే తరుణంలో జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేష్‌నాయుడు వర్గీయులకు ముద్దనూరులో రెండు మద్యం దుకాణాలు లాటరీలో వరించాయి. వీటిని గత నాలుగు రోజులుగా ఏర్పాటు చేయనీయకుండా మధుసూదన్‌రెడ్డి తన వర్గీయుల ద్వారా దౌర్జన్యం సాగిస్తున్నారు. దుకాణాల ఏర్పాటుకు భవనాన్ని సైతం అద్దెకు ఇవ్వనీయకుండా అడ్డుపడుతున్నారు. భూపేష్‌రెడ్డి వర్గీయులు భవనాన్ని సమకూర్చుకుని ప్రారంభించే ప్రయత్నంలో ఉండగా.. కొంతమంది మహిళలను పురిగొల్పి జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేయరాదంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే తెదేపా, భాజపా వర్గాలుగా విడిపోయే ప్రయత్నం చేశారు. వాస్తవానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఇరువురూ ఒకే కుటుంబానికి చెందినవారు. వారిద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ముద్దనూరులో మినహా నియోజకవర్గంలో ఎక్కడా ఇలాంటి సమస్య ఎదురుకాలేదు. ముద్దనూరు, ఎర్రగుంట్ల సీఐలు దస్తగిరి, నరేష్‌బాబు, ఎస్ఐ మొయినుద్దీన్‌లు 40 మంది ప్రత్యేక బలగాల నడుమ దుకాణం ప్రారంభించగా.. కాసేపటికి మధుసూదన్‌రెడ్డి వర్గానికి చెందిన మహిళలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారి ద్వారా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి పక్కనే దుకాణం ఏర్పాటు చేస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. దుకాణం మూయించాల్సిందేనంటూ పట్టుపట్టడంతో తాత్కాలికంగా మూసివేశారు. అనంతరం పోలీసులకు మహిళలు వినతిపత్రం అందజేసి వెనుదిరిగారు. ఇదిలా ఉండగా సురేష్‌నాయుడు వర్గీయులు మద్యం దుకాణాన్ని తెరవలేని పరిస్థితి నెలకొంది.


దుకాణం ఏర్పాటును నిరసిస్తూ పోలీసులకు విన్నవిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీకాంతమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, తదితరులు

జిల్లా వాలీబాల్ జట్ల ఎంపికలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ టోర్నీలో భాగంగా కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ రాష్ట్ర క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అరుణకుమారి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అండర్ 17 బాలికల విభాగంలో ఎస్.అఫ్రిన్, వి.నమిత, సి.అంజలి, బి.వైష్ణవి, ఎస్.స్వాతి, పి.నందిని, డి.మాధవి, ఎస్.సబీహ, ఎస్.సుజిత, పి.వినుత, కె.సహస్ర, ఎం.కళ్యాణి, బాలుర విభాగంలో వై.సోను, పి.చైతన్య, అనస్, అయాన, ఎ.శ్రీనాథ్, ఎం.శ్రీశాంత్, ఎస్.వెంకటసాయి, ఎస్.ధనుష్, పి.ఓంకార్, చరణ్, జస్వంత్‌రెడ్డి, నితీష్ ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో జి.అభిషేక్, సి.నాంగేంద్ర, బి.అశోక్, జి.ప్రశాంతి, కె.టోనీజోనాథన్, ఐ.హేమంత్, వై.శశాంక్, రామచరణ్, సంపత్, ఎం.అభిలాష్, చరణ్, డి.నితిన్, బాలికల విభాగంలో వై.వైష్ణవి, నేహ, ఎన్.జయప్రియారెడ్డి, మునిఅర్చన, కమలఅభినయ, కె.శ్రావణి, సి.సంధ్యారాణి, బి.వెంకటబిందు, భువనేశ్వరి, బి.భార్గవి, ఎన్.నాగతనూజ, జి.సృజన ఎంపికయ్యారు.


రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

'సార్వత్రిక' ప్రవేశాలకు గడువు పొడిగింపు

కడప విద్య, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024 - 25 విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి అక్టోబరు 25వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు డీఈవో అనూరాధ పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.200తో 29వ తేదీ వరకు, రూ.500తో 31వ తేదీ వరకూ అవకాశం ఉందని చెప్పారు. మరిన్ని వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ లేదా జిల్లావిద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఖాళీలు భర్తీ చేయాలని డిమాండు

మారుతీనగర్: జెన్‌కో ఆధ్వర్యంలోని విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ఆర్టీపీపీ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ దాదాపు 2500కు పైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, నగర సహాయకార్యదర్శి సంజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ ఒప్పంద అధ్యాపకుల సంఘం కార్యవర్గం ఎన్నిక

వేంపల్లె , న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఇడుపులపాయలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా కోటేశ్వరరావు (ఒంగోలు), ప్రధాన కార్యదర్శిగా తేజాకిరణ్(శ్రీకాకుళం), సంయుక్త కార్యదర్శిగా నిర్మలాకుమారి(శ్రీకాకుళం), కార్యనిర్వాహక కార్యదర్శిగా శివకుమార్(నూజివీడు)లను ఎన్నుకున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు.


అనిల్‌కుమార్‌రెడ్డి

బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండు

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించి, 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చిన్నయ్య డిమాండు చేశారు. రిమ్స్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సరెండర్‌లీవ్ రెండేళ్ల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆరు నెలలకు ఒక్కసారి చెల్లించాల్సిన డీఏలు, జీపీఎఫ్ లోన్లు, ఏపీఎల్ఐజీ బకాయిలు దీపావళి కానుకగా ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షులు రాము, నరసింహులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


దస్త్రాలు పరిశీలిస్తున్న డీఈవో అనురాధ, పక్కన హెచ్ఎం ఉమామహేశ్వరుడు

సిద్దవటం, న్యూస్‌టుడే : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని డీఈవో అనురాధ తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలు జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయానికి అందరూ సన్నద్ధంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం ఉమామహేశ్వరుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడప విద్య: విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యనందించేలా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ అన్నారు. స్థానిక గాండ్లవీధి నగరపాలక ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని యాస్మిన్‌బేగం, సీఆర్ఎంటీ కృష్ణ ఉన్నారు.

ఆర్టీపీపీ సిబ్బంది నల్ల పట్టీలతో విధులకు హాజరు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీపీపీలో ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం నల్ల పట్టీలతో విధులకు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్తు యాజమాన్య సంస్థలు ఒప్పంద కార్మికుల విషయంలో సవతితల్లి ప్రేమ చూపుతున్నాయన్నారు. ఒకే విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఏపీ జెన్‌కో ఒక విధంగా, ఇతర సంస్థలకు మరొక విధంగా వేతనాలు చెల్లిస్తున్నారని వివరించారు. కార్మికుల వేతనాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు.

యువ... సాంకేతిక తోవ

☛ ప్రాజెక్టుల రూపకల్పనలో కృషి

– న్యూస్‌టుడే, చాపాడు, గోపవరం

ఏ పని చేయాలన్నా సులభంగా వేగంగా చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం. పోటీ ప్రపంచంలో మానవ మనుగడకు సాంకేతికత తోడైతే తిరుగులేని వేగం ప్రగతి చేరువవుతోందని ఈ యువకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో పనిచేసేందుకు మ్యాన్ పవర్ ఉండదని, అంతా రోబోలమయమే అవుతుందని వారు తయారు చేసిన ప్రాజెక్టుల ద్వారా వివరిస్తున్నారు.

ప్రమాదాల నివారణ



వాహనంలో ప్రయాణం చేస్తున్నప్పుడు ముందు, వెనక వచ్చే వాహనాలు ప్రమాదవశాత్తు తగలకుండా ఉండేందుకు 'అబ్‌స్టాకల్ అవాయ్‌డెన్స్ రోబోట్ యూజింగ్ ఆర్డినో' ప్రాజెక్టు రూపొందించారు. ఎదుటి వాహనం ఢీకొడుతుందన్న సమయంలో నడిపే వాహనం పక్కకు తొలగిపోయి పార్కింగ్ అయ్యేలా చేస్తుందని ఆటోమేటిక్‌గా దిశ మార్చడమే కాకుండా నిలబడిపోతుందంటున్నారు ఈఈఈకి చెందిన అజయ్‌గణేష్, ఖాసీం, మెర్సి, అనూష, వీరలోహిత్‌కుమార్, సబీర్, రోషన్.

ఇంటికి ఏం జరిగినా చరవాణితో అప్రమత్తం



మన ఇంటి వద్ద ఎలాంటి అలజడి జరిగినా చరవాణికి కాల్, సందేశం వచ్చేలా 'మొబైల్ కాల్ ఎనేబుల్డ్ డోర్ సెక్యూరిటీ సిస్టం' రూపొందించారు. పెరుగుతున్న చోరీలను దృష్టిలో పెట్టుకుని దీన్ని తయారుచేసినట్లు ఈసీఈకి చెందిన ఆదికేశవరెడ్డి, విజ్ఞదీప్, చరణ్, ఓంసాయి, అజీజ్‌హుసేన్ తెలిపారు. ఇంటి తలుపులు తెరచుకోగానే ఫోన్ వస్తుందని కుటుంబ సభ్యులు ఇద్దరు, ముగ్గురికి సమాచారం అందుతుందని, నిద్ర సమయంలో బ్రజర్ వచ్చేలా చేశామన్నారు.

సహాయకులుగా రోబోలు

మిలిటరీ, ఎయిర్‌పోర్టుల్లో సామగ్రి మోసేందుకు సహాయకులుగా రోబోలు పని చేస్తాయని చెపుతున్నారు ఈసీఈ విద్యార్థులు. ఎలాంటి రిమోట్ లేకుండా సెన్సార్ ద్వారా మన నడకను అనుసరించి రోబోలు వస్తాయంటున్నారు విష్ణు, అజీజ్, శేఖర్, యుగేష్, యాసిన్, పవన్, మునఫ్. మనిషి సహాయం లేకుండా యంత్రానికి సామర్థ్యాన్నిబట్టి బరువు కేటాయించుకోవచ్చని వివరించారు.





దుకాణాల్లో వ్యాపారాభివృద్ధి

ఎక్కడ చూసినా మార్పులు వెలుస్తున్నాయి. వేల సంఖ్యలో వస్తున్న వినియోగదారులకు కావల్సిన వస్తువులు అందుబాటులో ఉండేందుకు 'ఇన్‌వెంట్రీ కంట్రోల్ మేనేజ్‌మెంట్ సిస్టం' పనిచేస్తుంది. ఎవరెవరు ఏ సరకులు కొంటున్నారు.. ఇది డేటా నమోదు చేస్తుంది. దుకాణానికి వచ్చిన కొనుగోలు దారుడికి సమయం ఆదా అవుతుందని కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థులు సాయిసారథిరెడ్డి, నవీన్‌క్రాంత్, రాజారెడ్డి, అభిలాష్, చాణక్యరెడ్డి చెబుతున్నారు.

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

పూడిక... నీరు పారక



జమ్మలమడుగులో ప్రొద్దుటూరురోడ్డులోని కన్నెలూరు క్రాస్ వద్ద కాలువ పూడికతో నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువ నుంచి నీరు పోయేందుకు మార్గం లేక రహదారిపైనే నిలిచి పోయాయి. ఇటీవలే నీటి కాలుష్యంతో కన్నెలూరు ప్రజలు పలువురు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. సమస్య పునరావృతం కాక మునుపే కాలువలో పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే కాలువలోని పూడిక తొలగించి సమస్యను పరిష్కరిస్తామని సచివాలయం శానిటేషన్ ఉద్యోగి వనజ కుమారి తెలిపారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

అధినేత సూచనలతో త్వరలో కార్యాచరణ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, బాధ్యులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి జమ్మలమడుగు నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ అధినేత ఎంతో విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వాటిని తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. 'ప్రజలు గెలవాలి - రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారని ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.



సమావేశానికి హాజరైన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటవీధి ఆదాయపుపన్ను శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ లైటింగ్ వీధిదీపాలు వెలగడం లేదు అప్పుడప్పుడు వీధిదీపాలు వెలగకపోవడం వలన చీకటిగా ఉంటుంది. - జిలాన్, స్థానికుడు

✓: వీధిదీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకుంటాను.
- వి.మల్లికార్జున, కమిషనర్, పురపాలక సంఘం, ప్రొద్దుటూరు
- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

స్త్రీవ్యాధి వైద్య నిపుణుల కొరత... మహిళల్లో కలత

జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిగా ముగ్గురికి ఒకరే దిక్కు



ఆసుపత్రిలో ఖాళీగా కాన్పుల వార్డు

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్టుల కొరత వేధిస్తోంది. చాలా మంది మహిళలు గైనకాలజిస్టులు లేకపోవడంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. ముగ్గురు స్త్రీవ్యాధి నిపుణులను కేటాయించగా సుమారు ఏడాదిగా ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 14వ తేదీన జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆదినారాణరెడ్డి వైద్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మిగిలిన ఇద్దరు గైనకాలజిస్టులను నియమించాలని వారికి సొంత నిధులైనా ఇస్తామని చెప్పడం గమనార్హం. ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు గైనకాలజిస్టుల పోస్టులకు సుమారు ఏడాదిగా ఒక్కరే పనిచేస్తున్నారు. సకాలంలో వైద్యసేవలు అందవని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా ఈ సమస్య వెంటాడుతున్నా ఉన్నతాధికారులు పరిష్కారం చూపడంలేదు. జమ్మలమడుగు పట్టణం, మైలవరం, పెద్దముడియం, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లా నుంచి మహిళలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు.

కాన్పుల లక్ష్యం : కాన్పుల లక్ష్యం ప్రతి నెలా వంద చేయాలి. గైనిక్ లేక పోవడంతో కేవలం 30 వరకు కాన్పులు జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు కేవలం 15 కాన్పులు జరిగాయి ఈనెలలో లక్ష్యం నెరవేరాలంటే మరో 85 కాన్పులు చేయాల్సి ఉంటుంది.



స్త్రీవ్యాధి నిపుణులుంటే మేలు : కాన్పులకే కాకుండా మహిళల సమస్యలు చెప్పేందుకు స్త్రీవ్యాధి నిపుణులు ఉంటే మేలు. ప్రతి చిన్న సమస్యకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేం కదా. చాలా రోజులుగా ఒక్కరే మహిళా వైద్యురాలు ఉన్నారు. పేద మహిళలు కాన్పులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు.
- మెరుగు పుల్లమ్మ, రాజీవ్‌నగర్ కాలనీ, జమ్మలమడుగు మండలం

లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి : ముగ్గురు గైనకాలజిస్టులకు ప్రస్తుతం ఒక్కరే పనిచేస్తున్నారు. ఒక పోస్టు ఖాళీ ఉండగా మరొకటి అనాథరైజ్డ్ ఆబ్‌సెంట్‌లో ఉన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాన్పుల సంఖ్య పెరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
- డాక్టర్. రఫీక్‌పాషా, సూపరింటెండెంట్, జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి

రహదారులు ఛిద్రం... జరభద్రం



అధ్వానంగా కల్లూరుకు వెళ్లే దారి



సీతంపల్లెలో రహదారిపై వర్షం నీటి నిల్వ

వైకాపా పాలనలో గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. చాపాడు మండలం రాజువారిపేట నుంచి వెళ్లే ప్రొద్దుటూరు, కల్లూరు రోడ్లను ఉదాహరణగా చెప్పవచ్చు. దారులు ఛిద్రమై కనిపిస్తున్నాయి. రాకపోకలు ఇబ్బందులు లేకుండా స్థానికులు గోతులకు గుండ్రాళ్లను పరిచారు. సీతంపల్లెలో వర్షపునీరు రహదారిపైనే నిల్వ చేరుతోంది. వాహన రాకపోకలతో అధ్వానంగా మారడంతో పరిసరాలు గగుర్పాటుకు గురి చేస్తున్నాయి. దెబ్బతిన్న రహదారులపై తిరిగే వారికి వెన్నెముక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. రహదారులు గుంతలు లేకుండా పూడ్చాలని ముఖ్యమంత్రి ఆదేశించినందున రోడ్లు బాగవుతాయని స్థానికులంటున్నారు. ఈ సమస్యలపై ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం నుంచి చాపాడు మండలం రాజువారిపేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, మైదుకూరు, చాపాడు

భూసేకరణకు గ్రామసభలు



సమావేశంలో పాల్గొన్న నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, రెవెన్యూ అధికారులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: బెంగళూరు-విజయవాడ ఆరు లైన్ల జాతీయ రహదారికి మూడో దశ భూసేకరణపై నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి ఎర్రగుంట్ల తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్‌చానల్ హైవే ఆరు లైన్ల జాతీయ రహదారి ఎర్రగుంట్ల మండల పరిధిలోని తిప్పలూరు, టి.సుంకేశుల, వై.కోడూరు, పెద్దనపాడు గ్రామాల మీదుగా వెళ్తుతున్నట్లు తెలిపారు. అవసరమైన మేరకు భూసేకరణ చేస్తున్నట్లు వివరించారు. త్వరలో గ్రామ సభలు నిర్వహించి రైతులతో చర్చించి భూసేకరణ చేయబోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల తహసీల్దారు శోభన్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వేడుకోలు

మైలవరం : పొలం తగాదాను పరిష్కారం చేస్తానని నమ్మబలికి రూ.1.30 లక్షల నగదును తీసుకుని మోసం చేసిన ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని మైలవరం మండలం బి.జంగాలపల్లె గ్రామానికి చెందిన మునగల వెంకట కొండారెడ్డి డిమాండు చేశారు. శుక్రవారం మైలవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సచివాలయ ఉద్యోగికి బెదిరింపులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక 17వ సచివాలయం పరిపాలనాధికారి కంసల ప్రభాకర్‌ను ఆ వార్డుకు చెందిన జరీఫ్‌హుస్సేన్ అనే వ్యక్తి దుర్భాషలాడారు. ఈ సంఘటనపై టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇంటి పన్నులో పేరు మార్పిడి దరఖాస్తు చేయగా రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. దీనిపై జరీఫ్ హుస్సేన్ ఫోన్ చేసి తనను బెదిరించారన్నారు. ప్రభుత్వ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్, పరిపాలనాధికారులు ప్రభాకర్‌కు మద్దతుగా నిలిచారు. కమిషనర్ మల్లిఖార్జున మాట్లాడుతూ.. ఏ ఉద్యోగిపై దాడి జరగకూడదని ఉద్యోగికి మద్దతుగా నిలుస్తానన్నారు.


ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దముడియం, న్యూస్‌టుడే: జమ్మలమడుగు పెన్నానది నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎన్.కొట్టాలపల్లె పోలీసు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. హరితో పాటుగా మరో ఇద్దరు ట్రాక్టరు డ్రైవర్లపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను జప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: లాడ్జిల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సీఐ శ్రీనివాసులు, ఎస్సై కొండారెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని లాడ్జిల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. లాడ్జికి వచ్చిన వారి వివరాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. లాడ్జిల్లో జూదం, మద్యపానం, వ్యభిచారం జరగకుండా చూడాలని చెప్పారు.

ఉద్యాన వనం గోడ ధ్వంసం



దెబ్బతిన్న ప్రహరీ ఇలా...

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఎర్రగుంట్ల రహదారిలో నిర్మించిన రాజీవ్‌గాంధీ జాతీయ ఉద్యానం ప్రహరీని ఎనిమిది చోట్ల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. నంగనూరుపల్లె, ఆంజనేయపురం, దానంబట్టివీధి చుట్టుపక్కల ఉన్న రాతి గోడలను కూలదోశారు. రాతి గోడలు తొలగించిన చోట్ల కొందరు కాలకృత్యాలు తీర్చుకోవడంతో స్వచ్ఛత, ఉద్యాన ఆహ్లాద పరిస్థితులను కాలరాస్తున్నారు. మద్యం, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రొద్దుటూరు ఉప డీఎఫ్‌వో దివాకర్‌ను వివరణ కోరగా పునర్నిర్మాణార్థం రూ.17 లక్షలతో ప్రతిపాదన పంపామన్నారు.

పాలన వ్యవహారాలపై అవగాహన అవసరం

గోపవరం, రాజుపాళెం, ముద్దనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలనా వ్యవహారాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని గోపవరం మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎం.రామనాథరెడ్డి అన్నారు. జడ్పీసీఈవో ఆదేశాల మేరకు శుక్రవారం గోపవరం, రాజుపాళెం మండలాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులకు పది అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపవరం ఈవోపీఆర్డీ హసీనా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కృషి చేయాలని కోరారు. రాజుపాళెంలో ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, ఈవోపీఆర్డీ షాకీర్ అలీఖాన్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న అధికారులు రామనాథరెడ్డి, హసీనా

పల్లె పండగతో అభివృద్ధి



కొండూరులో సిమెంటు రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బొజ్జా రోశన్న

అట్లూరు, గోపవరం, కలసపాడు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి ఎన్డీయేతోనే సాధ్యమవుతుందని నాయకులు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అట్లూరు, కలసపాడు, గోపవరం మండలాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గోపవరం మండలం ఎస్.రామాపురంలో రూ.2.75 కోట్లతో అనేక అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ పూజలు చేశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కె.జయరామిరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ మామిడి సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో ఎం.రామనాథరెడ్డి, ఈవోపీఆర్డీ హసీనా తదితరులు పాల్గొన్నారు. అట్లూరు మండలంలోని కొండూరులో సిమెంటు రహదారుల పనులకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ భూమి పూజ చేసి సిమెంటు వేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు బొజ్జా రోశన్న, కొండూరు సర్పంచి సుధ, నాయకులు మల్లికార్జునరెడ్డి. జయకృష్ణ, రెడ్డయ్య. అమర్‌నాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, ఎంపీడీవో భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు. కలసపాడులో తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు పి.బాలిరెడ్డి, ఎంపీడీవో మహబూబ్‌బీ రూ.15 లక్షలతో మూడు సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు అవశ్యం

రాజుపాళెం, న్యూస్‌టుడే: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం రాజుపాళెం మండల పరిషత్ సభా భవనంలో మండల సర్వసభ సమావేశాన్ని వైఎస్ ఎంపీపీ కూనపులి సుబ్బరత్నం అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యదర్శులు, వార్డు సభ్యులు, డ్వాక్రా సంఘ సభ్యులు, సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో తిగిరి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. అర్‌డబ్ల్యూఎస్ సఏఈ గౌతమి మాట్లాడుతూ రూ.10 కోట్లతో నీటిపథకాల పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఇదే తరుణం... బాగు చేస్తే ఉపయోగం

ప్రమాదకరంగా మారిన మైలవరం ఉత్తర కాలువ లైనింగ్



కోవెలకుంట్ల బైపాస్ వద్ద ధ్వంసమైన మైలవరం జలాశయం ఉత్తర కాలువ లైనింగ్



ప్రొద్దుటూరు రోడ్డులో రూపురేఖలు కోల్పోయిన దేవగుడి కాలువ

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

అన్నదాతలకు సంజీవని వంటి మైలవరం ఉత్తర ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరింది. పలు చోట్ల సిమెంటు పూత దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. మరికొన్ని చోట్ల కాలువ గోడలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం మైలవరం జలాశయం నిండుకుండలా ఉన్నందున రబీ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. శనగ రైతులు సైతం మైలవరం ఉత్తర కాలువపైనే ఆధార పడుతుంటారు. ఇలాంటి తరుణంలో కాలువ దెబ్బతిన్న చోట పూర్తిస్థాయి ఆధునికీకరణ చేయకపోయినా కనీసం మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

47 వేల ఎకరాలకు సాగునీరు ; మైలవరం జలాశయం ఉత్తర ప్రధాన కాలువ 34.340 కి.మీ. పొడవు ఉంది. 55 గ్రామాల్లోని 47,195 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అనుసంధానంగా నొస్సం ఉప కాలువ (33 కి.మీ.), టంగుటూరు (19.65 కి.మీ.), పెద్దపసుపుల (7 కి.మీ), దేవగుడి (10.15 కి.మీ), వెలవలి (12.66 కి.మీ.), గోపవరం (8.05 కి.మీ.) కాలువలు ఉన్నాయి. సుమారు 18 ఏళ్ల కింద కాలువలకు సంబంధించి ఆధునికీకరణ పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో జరగలేదు. జమ్మలమడుగు నుంచి రామిరెడ్డిపల్లె వెళ్లే దారిలో కాలువ లైనింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. నెర్రెలు చీలి పడిపోయే దశలో ఉంది. కోవెలకుంట్ల బైపాస్‌లో లైనింగ్ ధ్వంసమైంది. ప్రొద్దుటూరురోడ్డు మీదుగా వెళ్లే దేవగుడి బ్రాంచ్ కాలువ సైతం రూపు రేఖలు కోల్పోయింది. పలు చోట్ల ఇళ్లలోని నీటిని కాలువలోకి మళ్లించడంతో కాసారంలా మారింది. నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు : మైలవరం జలాశయంతోపాటు కాలువల ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు పంపించాం. తక్షణ అవసరాల కోసం సుమారు రూ.42 లక్షలు వినియోగించుకునేందుకు అనుమతి ఉంది. ఆ నిధులను మొదటి ప్రాధాన్యం కింద జలాశయం కట్ట, రక్షణ గోడలు, లైటింగ్ కోసం వినియోగించుకోవాలని నిర్ణయించాం. తర్వాత నిధులు విడుదలైతే కాలువల ఆధునికీకరణ కోసం ఖర్చు పెడతాం.
- రమేష్, ఈఈ, మైలవరం జలాశయం

మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి

మైదుకూరు : మానవ అక్రమ రవాణా నిర్మూలన గోడపత్రికను శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సయ్యద్ హాసంతో కలిసి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వాగ్దానం శివశంకర్, ములపాకు నాగేశ్వరరెడ్డి, మోతే ఉపేంద్ర, సుబ్బు, ఇమ్మడిశెట్టి సతీష్‌బాబు కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఆస్ట్రేలియా ఎ-21, ముంబయికి చెందిన మూమెంట్ ఇండియా, మదనపల్లె గ్రామజ్యోతి సహకారంతో అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో గోడపత్రికను రూపొందించారు.

అంతర్జాతీయ క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభ

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పీస్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థి షేక్ మహమ్మద్ అమీన్ అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ అశ్వక్, ప్రిన్సిపల్ లాల్‌ఖాన్, పీఈటీ భాస్కర్ తెలిపారు. వారు మాట్లాడుతూ యువశ్రీ గేమ్స్ కౌన్సిల్ ఇండియా(వైజీసీఐ) జిల్లా జట్టుకు తమ విద్యార్థి ఎంపికయ్యారన్నారు. నేపాల్‌లో గత నెల 28న జరిగిన అంతర్జాతీయ స్థాయి జట్టులో పాల్గొన్నారన్నారు. మొదటి మ్యాచ్ శ్రీలంకతో తలపడిన షేక్ మహమ్మద్ అమీన్ బ్యాటింగ్‌లో 14 రన్స్, బౌలింగ్‌లోను 3 వికెట్లు తీశారన్నారు. ఈ నెల 12న దిల్లీలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో తమ విద్యార్థి బంగారు పతకం, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నాడని అభినందించారు.



నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న షేక్ మహమ్మద్ అమీన్

ఐదేళ్లూ నిర్లక్ష్యం... గ్రంథాలయాలకు శాపం


కూటమి ప్రభుత్వంపైనే పాఠకుల ఆశలు



బద్వేలులోని పప్పులవీధిలో కొనసాగుతున్న గ్రంథాలయం

- న్యూస్‌టుడే, బద్వేలు, గోపవరం, ప్రొద్దుటూరు విద్య

ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రంథాలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. సొంత భవనాల నిర్మాణం విషయాన్ని గాలికొదిలేశారు. కడపలో రూ.5 కోట్ల వ్యయంతో జిల్లా కేంద్ర గ్రంథాలయం బిల్లులు రాక శ్లాబ్ వరకు పని జరిగి అర్ధాంతరంగా నిలిచిపోయింది. గోపవరంలో రూ.16 లక్షలతో నిర్మించిన నూతన భవనం బిల్లులు రాని కారణంగా వినియోగంలోకి రాలేదు. ఈ కారణంగా మూతపడింది. బద్వేలు రెవెన్యూ డివిజన్ కేంద్రం అయినప్పటికీ సొంత భవనం లేదు. పట్టణంలోని పప్పులవీధిలో అద్దె గృహంలో కొనసాగుతోంది. అందరికీ అందుబాటులో లేకపోవడం, తాపలు ఎక్కే పరిస్థితి కారణంగా ఇక్కడికి రావడాన్ని చాలామంది వరకు పాఠకులు మానేశారు. గుంతపల్లెలో ఐదు సెంట్ల సొంత భవనం నిర్మాణార్థం స్థలాన్ని సేకరించారు. ఎన్నికలకు ముందు రూ.36 లక్షలతో పనులను గుత్తేదారుడు మొదలు పెట్టగా అప్పటి కమిషనర్ కృష్ణ అభ్యంతరం పెట్టడంతో పని ఆగింది. ఆ నిధులను కోటవీధిలో పాత గ్రామ పంచాయతీ స్థలంలో భవనాన్ని నిర్మించారేకాని గ్రంథాలయానికి స్వాధీనం చేయకపోగా ఉప ఖజానా కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. సొంత భవనాలు ఉండేది కేవలం 22 మాత్రమే. రెంట్‌ఫ్రీతో నడిచేవి, అద్దె గృహాల్లో కొనసాగేవి మొత్తం 41 ఉండగా వీటికి సొంత భవనాలకు స్థల సేకరణ చేసి నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం నుంచి గ్రంథాలయాలకు అద్దె సుమారు రూ.70 వేలు మాత్రమే నెలకు వస్తోంది. ఏడాదికి రూ.8 లక్షలకు పైగా ప్రభుత్వానికి భారం పడుతోంది. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రంథాలయాలు బాగుపడతాయని ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఈ సమస్యలపై జిల్లా గ్రంథాలయాధికారి అమీరుద్దీన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



సొంత భవనాలు నిర్మించాలి : చాలా గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె ఇళ్లల్లోనూ, రెంట్ ఫ్రీగా ఇచ్చేవాటిలో నడుస్తున్నాయి. సౌకర్యాలు, కొత్త పుస్తకాలు లేవు. ఇప్పుడు అప్‌డేట్‌గా రాలేదు. నిరుద్యోగులు కాంపిటీషన్ టెస్ట్‌లకు ప్రిపేరు కావాలంటే కష్టంగా ఉంది.
- నాగేశ్వరరెడ్డి, పాఠకుడు, బద్వేలు

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

మధ్యాహ్న భోజనం పరిశీలన


మెనూను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కడప నగరంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. కాగితాలపెంటలోని ఉర్దూ మండల పరిషత్, ఉన్నత పాఠశాల, గాంధీనగర్, చెమ్ముమియాపేటలోని పాఠశాలలను సందర్శించారు. వసతి గదులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెర్లోపల్లిలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


రామాలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ విగ్రహాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని చెర్లోపల్లిలో పునర్నిర్మాణం చేసిన రామాలయంలో సీతారామలక్ష్మణమూర్తులు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామోత్సవం సందడిగా సాగింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: కడప ఆర్టీసీ బస్టాండు నుంచి మురళీ థియేటర్ వరకు వెళ్లే దారిపై గుంతలు పడి అధ్వానంగా మారింది. రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. మరమ్మతులు చేపట్టాలి. **- రామకృష్ణ, కడప**

✔: రోడ్డుపై పడిన గుంతలను, నిల్వ ఉన్న నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప**

- న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: మాధవరం-1 గ్రామంలో చెత్త తరలించడానికి నెల రోజులుగా ట్రాక్టరు రావడం లేదు. ఎక్కడ చెత్త అక్కడే నిల్వ ఉంది. దుర్వాసన భరించలేక పోతున్నాం. సమస్య పరిష్కరించండి. **-రాము, మాధవరం-1**

✔: ట్రాక్టరు ట్రాలీ శిథిలావస్థకు చేరింది. త్వరలో మరో ట్రాలీ కొనుగోలు చేసి చెత్త తరలించే పనులు చేపడతాం.
- లక్ష్మీనరసయ్య, గ్రామ కార్యదర్శి **-న్యూస్‌టుడే, సిద్దవటం**

?: నగరంలోని బైపాస్ ప్రధాన రహదారి సమీపంలో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. తొలగించాలి. **- వెంకట్, స్థానికుడు**

✔: సిబ్బందిని పంపించి చెత్తకుప్పలను తొలగిస్తాం.
- చంద్రశేఖర్, ఎంహెచ్‌వో **- న్యూస్‌టుడే, బిల్టప్**

శంకరాపురం... రహదారులు దారుణం

న్యూస్‌టుడే, శంకరాపురం(కడప నగరపాలక)


శంకరాపురంలో మద్రాసు రోడ్డు దుస్థితి


పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో ఇలా...

ప్రజారోగ్య సాంకేతిక శాఖ, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులు శంకరాపురంలోని రహదారులను ధ్వంసం చేశాయి. అప్సరా థియేటర్ కూడలి నుంచి నమస్తే బోర్డు వరకు ఎడమ వైపు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అమృత్ పథకం కింద పైపులైన్లు వేయడానికి ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఈ కీలక మార్గంలో దాదాపు రెండేళ్ల నుంచి తవ్వకాలు చేపడుతూనే ఉన్నారు. పనులు పూర్తయినా రోడ్డు పునర్నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవడం లేదు. కాంట్రాక్టరు పనులు పూర్తి చేసిన తర్వాత పైప్‌లైన్లకు నీళ్లు వదిలి పరీక్షలు చేయాలని చెబుతున్నారు. అమృత్ పనులు చేపట్టిన గుత్తేదారు పనులు నిలిపేయడంతో కొన్ని నెలలుగా ఈ ప్రాంత వాసులు ఛిద్రమైన రహదారులపై రాకపోకలు సాగించడానికి నానా తంటాలు పడుతున్నారు. శంకరాపురంలోని అంతర్గత వీధుల్లోనూ ఇదే పరిస్థితి. అమృత్ ఓవర్‌హెడ్ ట్యాంకు కడుతున్న ప్రాంతంలో రోడ్లను ఇష్టానుసారం తవ్వడంతో మొత్తం బురదకుంటలా మారింది. ఇక్కడ కనీసం నడక సాగించడానికి కూడా వీలు కాదు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్న ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికుల నివాసాలున్నాయి. ఈ దుర్గంధం మధ్యే వారు గత ఆరు నెలలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ సమస్యలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారి అంజలీకుమార్‌ను సంప్రదించగా రెండు నెలల్లో అన్ని పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.

రైతులను ఆదుకోవాలని వినతి

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలో పెన్నాతీరంలోని గ్రామాల్లో ప్రతి ఏడాది వరద నీట ఉద్ధృతికి భూమి కోతకు గురై రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని వారిని ఆదుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పాల వెంకటసుబ్బయ్య, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాదు శుక్రవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను కలిసి కోరారు.

అనాథలకు పిండప్రదానం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: వివిధ రకాలతో, అనారోగ్యాలతో మృతి చెందిన 375 అనాథలకు శ్రీకాళీశ్వనాథ సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు చేశారు. ఈ మేరకు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సభ్యులు కాశీలోని గంగానది ఒడ్డున పిండ ప్రదానం చేసేందుకు శుక్రవారం బయలుదేరారు. సంస్థ సభ్యుడు రవి మాట్లాడుతూ ఈ నెల 21న పిండ ప్రదానం చేస్తామన్నారు.

వీధి దీపం... నిర్వహణ అస్తవ్యస్తం


పులివెందుల బాకరాపురంలో వెలగని వీధిదీపం

పులివెందుల(వేముల): పులివెందుల పురపాలికలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పురపాలిక పరిధిలోని 33 వార్డుల్లో సుమారు 11,575 వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఇందులో 40 శాతం మరమ్మతులకు గురయ్యాయి. నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకునేవారు లేరు. దీంతో పట్టణంలో 33 వార్డుల్లో నివసిస్తున్న 82వేల మంది ప్రజలు చీకట్లో మగ్గే పరిస్థితి ఏర్పడింది. వీధిదీపాల నిర్వహణ కోసం ప్రతి ఏటా లక్షల్లో నిధులను వ్యయం చేస్తున్నట్లు పురపాలిక రికార్డుల్లో నమోదుచేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. బాకరాపురం, సీయోనోపురం, ఎర్రగుడిపల్లె, చెన్నారెడ్డికాలనీ, క్రిశ్చియన్‌వీధి, ఎస్‌బీఐ కాలనీ, చిన్నకొండారెడ్డి కాలనీ, జయమ్మ కాలనీలతోపాటు పలువీధుల్లో వీధిదీపాలు అలంకారప్రాయంగా కన్పిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చాలావాటికి స్విచ్‌లు కాలిపోవడంతోపాటు తీగలు తెగిపోయాయి. దీంతో కొన్నిచోట్ల నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే కోట్ల రూపాయిల్లో విద్యుత్తు బిల్లులు బకాయిలున్నాయి. గతంలో ఎస్పీడీసీఎల్ అధికారులు పురపాలికకు నోటీసులు కూడా జారీచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిదీపాల నిర్వహణను సక్రమంగా నిర్వహించేలా చూడాలని పురప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


వేంపల్లెలో సిమెంటురోడ్డు పనుల భూమిపూజలో పీఆర్ డీఈ సుధాకర్‌రెడ్డి, నాయకులు

వేంపల్లె , న్యూస్‌టుడే: పల్లెపండగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని పంచాయతీరాజ్ డీఈ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక మౌనిబాబాగుడి వీధిలో శుక్రవారం రూ.75 లక్షలతో నిర్మించతలపెట్టిన సిమెంటురోడ్డుకు జిల్లా తెదేపా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి, మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డిలతో కలసి భూమిపూజ చేశారు. నిమ్మకాయల దర్బార్, పాములూరు చంటి, డక్కాశ్రీను, శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి కమ్మవారిపల్లె పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్ల నిర్మాణానికి శుక్రవారం అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగమల్లేశ్వర్‌రెడ్డి, బాబయ్య, వెంకటరెడ్డి, భారాహుస్సేన్ పాల్గొన్నారు.

తొండూరు: మండల పరిధిలోని పాలూరు గ్రామంలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లకు ఎంపీడీవో విష్ణుప్రసాదు, ఏపీఎం లావణ్య భూమిపూజ చేశారు. తెదేపా నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

వేముల : మండలంలోని చాగలేరు, నల్లచెరువుపల్లెలో సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని శుక్రవారం రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి ప్రారంభించారు. పీఆర్ ఏఈ అబ్దుల్లా, మండల తెదేపా అధ్యక్షుడు బ్రహ్మయ్య, భాస్కర్‌రెడ్డి, యేసు, రాజారెడ్డి, ఉపాధిసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తోల్లగంగన్నపల్లె సమీపంలోని వేదాస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సింధూర, జనీత్, లక్ష్మినాథ్‌రెడ్డిలు క్యారమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ధర్మధీరజ్ తెలిపారు. నందలూరులో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు విజేతలుగా నిలిచారని చెప్పారు. వారిని కరస్పాండెంటు దిలీప్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, సౌజన్య అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని ఎస్.ఐ శివప్రసాద్ హెచ్చరించారు. కోదండరామనగర్ శివారు, చెరువు తూము సమీపంలో ఖాళీ స్థలాల్లో పడేసిన మద్యం సీసాలను డోజర్ సాయంతో ధ్వంసం చేశారు.

చింతకొమ్మదిన్నె: బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని గ్రామీణ సీఐ శంకర్‌నాయక్ అన్నారు. ఏఎల్ కాలనీ సమీపంలోని ఓ వెంచర్‌లో పలువురు బహిరంగంగా మద్యం తాగుతున్నారనే సమాచారంతో, ఎవరూ వెళ్లకుండా జేసీబీతో గుంతలు తీయించారు. ఎస్సై శ్రీనివాసులురెడ్డి, హెచ్‌కానిస్టేబుల్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

నిల్వ నీటిని తొలగించండి


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

బిల్టప్ కడప న్యూస్‌టుడే: నగరంలో వర్షాలతో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, గురుకుల్ విద్యాపీఠ్, అప్సరా సర్కిల్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెత్త తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం


చిన్నచౌకు ఠాణాను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప, నేర వార్తలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కడప చిన్నచౌకు ఠాణాను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు. ఎఫ్ఐఆర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఠాణాలకు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులను స్వీకరించి తక్షణం పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో చోరీలు జరగకుండా తగిన బందోబస్తు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సీఐ తేజమూర్తి, ఎస్సై రవికుమార్ ఉన్నారు.

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

న్యూస్‌టుడే, మారుతీనగర్


ఎర్రముక్కపల్లెలో ఇళ్ల మధ్య వరాహాల సంచారం

నగర నడిబొడ్డున ఎర్రముక్కపల్లెలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇళ్ల మధ్యన మురుగు నిలిచి పందులు తిరుగుతూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన దుర్వాసనతోపాటు ఈగలు అధికంగా వస్తున్నాయి. నిమిషం కూడా తలుపులు తెరిచి ఉంచలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో పలువురు రోగాలపాలవుతున్నారు. ఇళ్ల మధ్య ఎక్కడపడితే అక్కడ చెత్త స్టాక్ పాయింట్లు పెడుతున్నారని, స్థానిక సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాల్వాముని ఆశ్రమం నుంచి చౌడమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు లేదు. వర్షం వచ్చినప్పుడల్లా నీళ్లు నిలుస్తున్నాయి. స్థానిక పీఎఫ్ కార్యాలయ ఎదురు సందులో చివరన శనీశ్వరస్వామి ఆలయం పక్కన, సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగాయి. ఇక్కడ గుర్తు తెలియని వ్యక్తులు మద్యం, గంజాయి తాగడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఉన్న పల్లె కంటే దారుణంగా పరిస్థితి ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, మురుగు కాలువలు శుభ్రం చేసి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై స్థానిక స్థానిక వార్డు సచివాలయ అడ్మిన్ విజయశాంతి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యదర్శికి చెప్పి పందుల నివారణకు చర్యలు తీసుకుంటామని, స్థానికులకు ఇబ్బంది లేకుండా చూస్తామని పేర్కొన్నారు.


శనీశ్వరస్వామి ఆలయ సమీపంలో పెరిగిన ముళ్లపొదలు

నిత్యం భయం..భయం

చాలా కాలం నుంచి ఇళ్ల మధ్య, ఖాళీ ప్రదేశంలో మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో పందులు గుంపులుగా వస్తున్నాయి. చిన్నారుల మీద ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళన చెందుతున్నాం. నగరపాలిక అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రోగాలతో, దుర్వాసనతో ఎన్నాళ్లు బతకాలి? **- దస్తగిరిరెడ్డి, స్థానికుడు**

బయట ఉండలేని పరిస్థితి

ఎర్రముక్కపల్లెలోని పలు ప్రాంతాల్లో దోమల ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. పిల్లలు, పెద్దలు ఒక్క నిమిషం కూడా బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. నగరపాలక అధికారులు గత సంవత్సరంలో దోమల పొగ కొట్టారు. ఇప్పటి వరకు ఇటువైపే రాలేదు. మురుగు సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. **- రాజేశ్వరి, స్థానికురాలు**

మాదిగలపై దాడులను ఖండించాలి

పులివెందుల(వేంపల్లె) , న్యూస్‌టుడే: మాదిగలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల భాస్కర్ అన్నారు. శుక్రవారం సంఘ రాష్ట్ర కార్యదర్శి రమణ ఇతర నేతలతో కలిసి పులివెందులకు వచ్చారు. ఇక్కడి పాత ఆర్టీసీబస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సింహాద్రిపురం మండలం బలపనూరులో దాడికి గురైన భార్గవ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. పులివెందుల బాధ్యుడు గంగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు గంగాధర్, గౌరవాధ్యక్షుడు గోపాల్, రవి, రామచంద్ర, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి

పులివెందుల,(వేంపల్లె) , న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, పార్టీనాయకులు, కార్యకర్తలు ఎంపీని కలిసి తమ సమస్యలను విన్నవించారు.

ప్రణాళికతోనే లక్ష్యసాధన



మాట్లాడుతున్న వీసీ విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ (కడప), న్యూస్‌టుడే: విద్యార్థులు ఒక ప్రణాళికబద్ధంగా చదివి అత్యున్నత లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతర సాధన చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనవర్సిటీ వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాగతోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని అత్యుత్తమంగా ఎదగాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎన్.రాజేష్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి.

సాహితీ కళాజాతరకు వేంపల్లె ఉపాధ్యాయుడు

వేంపల్లె, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమానికి వేంపల్లె జడ్పీబాలికల ఉన్నతపాఠశాల ప్లస్2 విభాగంలో సివిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆవుల వెంకట్ ఎంపిక య్యారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శని, ఆదివారాల్లో జరిగే కార్యక్రమంలో వెంకట్ పాల్గొని కవితాగానం చేయనున్నారు.

శనగ విత్తనాల పంపిణీ

లింగాల, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రాయితీ శనగలను పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. దొండ్లవాగులో శుక్రవారం విత్తనాల పంపిణీని ప్రారంభించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సర్పంచులకు, వార్డు సభ్యులకు ప్రభుత్వ పథకాలపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని డీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ఎంవోటీఎస్‌లు శ్రీనివాసులు, ప్రేమలత పాల్గొన్నారు.

కమలాపురం : గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని ఎంపీడీవో జ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవోపీఆర్డీ కెజియా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు : పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో రఘురామ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండు రోజులు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈవోపీఆర్డీ శ్రీధర్ తదితరులున్నారు.

ఒంటిమిట్ట : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి సోమశేఖర్, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.